క్రీడలతో మానసికోల్లాసం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్ రాజ్‌కుమార్

అబిడ్స్: క్రీడా పోటీలు ఉద్యోగుల మానసికోల్లాసానికి దోహద పడుతాయని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్ కుమార్ పేర్కొన్నారు. జనవరి 4వ తేదీ నుంచి టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం నిర్వహించే క్రికెట్ ఆట పోటీలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లాల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగుల్లో పని ఒత్తిడిని అధిగమించడానికి కూడా ఈ క్రీడా పోటీలు అండగా ఉంటాయన్నారు. ఈ పోటీలకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కూడా విచ్చేస్తున్నట్లు తెలిపారు.

కుట్టు మెషిన్ల పంపిణీ

చార్మినార్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ పార్టీ నిరంతరం పని చేస్తుందని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మొగల్‌పురాలోని ఉర్దూఘర్‌లో పేద మహిళలకు ఉచితంగా కుట్టు మెషిన్ల పంపిణీ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ పార్టీ అన్ని పార్టీలవ కన్నా ముందుందన్నారు.



మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

కాంగ్రెస్ హయాంలో ఎరుకలకు న్యాయం



గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఎరుకల కులస్తులకు న్యాయం జరుగుతుందని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ అన్నారు. కర్మన్‌ఘాట్‌లో ఆదివారం జరిగిన ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆయన ఎరుకల సోదరులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్వాన్ నుంచి తరలివెళ్లారు. డి.కృష్ణ, శేఖర్, సత్యనారాయణ, రాము, కృష్ణ, రాజు, శ్రీరాములు తదితరులున్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ కోటలో పర్యాటకులు



చార్మినార్-గుల్జార్‌హౌజ్ రోడ్డులో..

చార్మినార్: ఓవైపు వీకెండైన ఆదివారం.. మరోవైపు 2023 సంవత్సరానికి గుడ్‌బై కావడంతో పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. దూర ప్రాంతాల నుంచి సందర్శకులు పాతబస్తీ చార్మినార్ కట్టడం వద్దకు తరలివచ్చి ఎంజాయ్ చేశారు. చార్మినార్, మక్కా మసీదు, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్‌లకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడంతో చిరు వ్యాపారాలతో పాటు షో రూం వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి.

గోల్కొండ కిటకిట..

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటక శోభను సంతరించుకుంది. సంవత్సరం చివరి రోజు భారీ సంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. భారీ సంఖ్యలో పర్యటకులు రావడంతో కోట సిబ్బంది అప్రమత్తమై పర్యాటకుల బ్యాగులను తనిఖీ చేసి మరి కోట లోపటికి అనుమతించారు. మరోవైపు కోట బడాబజార్, మహిళాగంజ్ తదితర ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్లు, గిఫ్ట్ షాపులు పర్యాటకుల కొనుగోళ్లతో సందడిగా మారాయి.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ ఎండీ జావిద్

గోల్కొండ: కేలండర్‌లు అందరికీ అర్థమైయ్యేలా, ఉపయోగపడేలా ఉండాలని కుల్సుంపురా ఏసీపీ మహ్మద్ జావిద్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్‌లో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సమాజానికి చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.శశిధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు ముత్యాల దుర్గారాణి, ఆర్.ప్రేమాచారి, ఎస్.రాజు, లక్ష్మి, బి.స్వాతి, భార్గవి, రాజేశ్వరి తదితరులున్నారు.

ఉపాధి కోల్పోతున్న సెట్విన్ బస్సుల కార్మికులు



హసన్‌అలీ

అబిడ్స్: మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేపట్టడంతో సెట్విన్ బస్సుల కార్మికులు ఉపాధి కోల్పోతూ రోడ్డున పడుతున్నారని సెట్విన్ బస్ న్యూ ఎంటర్‌ప్రైమరి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.హసన్‌అలీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..సెట్విన్ సంస్థలో దాదాపు 100 బస్సులకు 500 మంది కార్మికులు పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత నిర్ణయంతో 500 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డుపాలయ్యారన్నారు. ప్రభుత్వం సెట్విన్ సంస్థలపై ఉన్న మేనేజ్‌మెంట్ ఛార్జీలు రూ.10 వేలు మాఫీ చేయాలని అసలైన డిమాండ్ చేశారు.

ముగిసిన స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలు



కార్యక్రమంలో వినోద్ కుమార్ సింగ్, విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్-కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-క్రీడా) ఆదివారం స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా పక్షోత్సవాలు ఘనంగా ముగిశాయి. డిసెంబర్ 16న ప్రారంభమైన ఈ స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు ఆదివారం ముగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో కిసాన్ దివాస్, ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో రైతులు తమ ఇల్లు, పరిసరాలు, పొలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని..అవశేషాలను సేంద్రీయ ఎరువుగా రీసైకిల్ చేయాలని..సింగిల్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రోత్సహించడానికి క్విజ్, రంగోళి పోటీలను నిర్వహించి విజేతలకు ఐసీఏఆర్-కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్ బహుమతులను ప్రదానం చేశారు.

సంక్రాంతి ఉత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



గోల్కొండ: సాలార్‌జంగ్ కాలనీ తిరుపల్లి గడ్డలోని శ్రీ కోవేల రంగ నాయక స్వామి ఆలయ సంక్రాంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు సోమారపు జనార్దన్ తదితరులు ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో అత్యంత ప్రాచీనమైన ఈ దేవాయాల పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు మార్గదర్శకంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. జనవరి 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు. హోమంలో పేర్ల నమోదు కోసం 98663 25486, 92463 22082 లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, విజయ్‌బాబు, జగన్నాథం తదితరులున్నారు.

రెండోసారి అధ్యక్షుడిగా డాక్టర్ విజయ్ కుమార్



గౌలిపురా: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి డాక్టర్ విజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శివ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, కోశాధికారిగా సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా పంచం రాజులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర సంఘం నాయకులు తెలిపారు.

ఎన్‌బీఎస్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దర్శన్, సత్యనారాయణ

జియాగూడ: ప్రతియేటా ఇమాంపురా నవభారత్ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించడం హర్షణీయమని జియాగూడ కార్పొరేటర్ దర్శన్ అన్నారు. ఆదివారం జియాగూడ ఇమాంపురాలో గల నవభారత్ సంఘంలో అధ్యక్షుడు మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యాదయ్య, సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, జశ్వంత్‌కుమార్, మహేష్‌బాబు, కిరణ్‌కుమార్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ సురేందర్, దర్శన్, గౌతమ్, మురళి పాల్గొన్నారు.

అమ్మవారి అలంకార చీర దహనం

చాంద్రాయణగుట్ట: అలియాబాద్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ అలంకార చీరను గుర్తుతెలియని వ్యక్తి దహనం చేసిన ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. అమ్మవారి ఆలయంలోకి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి విగ్రహానికి ఉన్న చీరను తొలగించి బయట పడేసి నిప్పంటించాడు. అమ్మవారి విగ్రహం ముందున్న పాదాలను కూడా బయట పడేశాడు. ఆలస్యంగా గమనించిన స్థానికులు నగ్నంగా ఉన్న అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. ఆలయ కమిటీ చైర్మన్ నరేష్ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అన్నివర్గాల సంక్షేమం



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరి, ఉమ్మడి రాష్ట్రాల మేరు యువ జన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్‌రెడ్డిని ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోపు అమలు చేస్తుందన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర



మీరాలంమండి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

చార్మినార్: శబరిమలకు సైకిల్ యాత్ర ద్వారా బయలు దేరిన అయ్యప్ప స్వాములు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరం నుంచి బయలుదేరిన అయ్యప్ప స్వాములు తిరుపతి, అరుణాచలం ద్వారా కేరళకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ సత్యనారాయణ, చలువాది శ్రీకాంత్ గురుస్వామి, సత్యనారాయణ గురుస్వామి, శంకర్ గురుస్వామి, గాజుల ప్రవీణ్, మల్లంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

సుల్తాన్‌బజార్: మాలధారణ ద్వారా భక్తితో పాటు పుణ్యం చేకూరుతుందని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం సాయంత్రం అయ్యప్ప మహాపడి పూజను జాంబాగ్‌లోని పూలమార్కెట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. రాఘవ, రాజారామ్‌స్వామి, శేఖర్‌స్వామి, శ్రీకాంత్‌స్వామి, జితిన్‌స్వామి పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



గౌలిపురా: పాండురంగ విఠల్ రుక్మిణీ ఆలయం ఆధ్వర్యంలో పాండురంగ విఠల్ రుక్మిణీ భగవాన్ పల్లకీ సేవా ఊరేగింపు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలే జితేంద్రను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, విలాస్ రావు, శివాజీ రావు, దిగంబర రావు, అశోక్ రావు, దొండేరామ్, బాలాజీ, ఆర్.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

గన్‌ఫౌండ్రీ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మెగాసిటీ నవకళావేదిక 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు వైద్యులకు వైద్య శ్రీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ దేవుడి తర్వాత వైద్యుడికే చేతులెత్తి నమస్కరిస్తారని, ప్రాణం నిలిపే వైద్యుడు ఎంతో గొప్ప అన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, కార్మిక శాఖ ప్రభుత్వ న్యాయవాది డీఎల్ పాండు, మెగా సిటీ నవకళావేదిక వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం

22న ప్రతి ఇంటా దీపావళి సంబరాలు



రాములోరి అక్షింతలతో ముక్క కృష్ణాగుప్తా

అబిడ్స్: జనవరి 22న ప్రతి ఇంటా పెద్ద పండుగ జరుగబోతుందని గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా పేర్కొన్నారు. అయోధ్య రాములోరి అక్షింతల ఊరేగింపు గోషామహల్, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలో పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణాగుప్తా మాట్లాడుతూ..22న ప్రతి ఇంటా దీపాలు వెలిగించి సంబరాలు చేయాలన్నారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవంతో ఎన్నో సంవత్సరాల నాటి హిందూవుల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు.